పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

● ఫీజు చెల్లింపునకు ఈనెల 12 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు ఈ నెల 12వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈ విషయమై అనుబంధ కాలేజీలు, విభాగాలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వర్సిటీ పరీక్షల డీన్ కొంగర సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి రాజమాణిక్యం తెలిపారు.



పెళ్లకూరు మండలం చిల్లకూరు, పెళ్లకూరు, పునబాక గ్రామాల్లో నీట మునిగిన పొలాలు



వాకాడు మండలంలో రొయ్యల కాలువ పొంగడంతో తెగిపోయిన ముట్టెంబాక-చిట్టమూరు రోడ్డు



చిట్టమూరు మండలంలో తెగిపోయిన మొలకలపూడి రోడ్డు



పెళ్లకూరు మండలం పాలచ్చూరు దళితవాడలో కూలిన ఇల్లు

దిత్వా ఎఫెక్ట్

ఏడు మండలాల్లో ముంచెత్తిన వాన

● వాకాడులో రికార్డు స్థాయిలో 28 సెంటీమీటర్ల వర్షపాతం
● వందలాది ఎకరాల్లో నీట మునిగిన వరి పొలాలు
● గోడ కూలి వృద్ధురాలి మృతి
● విందూరులో ఆటోరిక్షాపై కూలిన విద్యుత్ స్తంభం
● నీటి ఉధృతికి కొట్టుకుపోయిన మొలకలపూడి రోడ్డు



పెళ్లకూరు మండలం పునబాక ఆర్ అండ్ బీ రోడ్డుపై బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాను తరచూ తుఫాన్‌లు వెంటాడుతున్నాయి. నిన్నగాక మొన్న మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టాలకు పరిహారం కూడా అందక మునుపే దిత్వా తుఫాన్ దూసుకొచ్చింది. వాయుగుండం నుంచి అల్ప పీడనంగా బలహీనపడినప్పటికీ జిల్లాపై మాత్రం ప్రభావం కనబరిచింది. గత నెల 30న తుఫాన్ ప్రభావం మొదలైనప్పటికీ మొదటి మూడు రోజులూ మోస్తరు వానలే కురిశాయి. అయితే మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ 22.30 గంటల వ్యవధిలోనే ఏడు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. వందలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. కూరగాయల పంటలు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకు 270 ఎకరాల్లో మాత్రమే వరిపొలాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందని తెలిపారు.

ఏడు మండలాల్లో భారీ వర్షాలు

దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 6 గంటల నడుమ జిల్లాలోని సముద్రతీర ప్రాంత ఏడు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. వాకాడు మండలంలో రికార్డు స్థాయిలో 280 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పొరుగునే ఉన్న చిట్టమూరు మండలంలో సైతం 261.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోట మండలంలో 220, దొరవారిసత్రం మండలంలో 135.8, నాయుడుపేటలో 115.2, ఓజిలిలో 109.4, తడలో 93.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. దిత్వా తుఫాన్ ప్రభావం గత నెల 30వ తేదీనే మొదలైనా ఆ రోజున కనిష్ఠంగా 4.8 మి.మీ.లు, గరిష్ఠంగా 45.2 మి.మీ.లు చొప్పున, ఈనెల 1న కనిష్ఠంగా 1.4 మి.మీ.లు, గరిష్ఠంగా 45.6 మి.మీ.లు వంతున, 2న ఉదయం 8.30 వరకూ అత్యల్పంగా 2 మిల్లీమీటర్లు, అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదవగా తర్వాతి 22.30 గంటల వ్యవధిలో తీర ప్రాంత మండలాల్లో రికార్డు స్థాయి వర్షాలు పడ్డాయి. ఈ భారీ వర్షాలకు స్వర్ణముఖి, కాళంగి, కైవల్య సహా పలు నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఉధృతంగా ప్రవాహాలు




పెళ్లకూరు మండలం నెలబల్లి చెరువు తూముకు ఇరువైపులా గండ్లు పడగా ఇసుక బస్తాలు వేస్తున్నరైతులు - మృతిచెందిన రేణుకమ్మ

- కోట మండలం గోవిందపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్ పొంగి ప్రవహిస్తోంది.
- గూడూరు పంబలేరు చప్టాపై వరద నీరు ప్రవహిస్తోంది. వేములపాలెం చప్టాపై కూడా వరద నీటి ప్రవాహం మొదలైంది. విందూరు సమీపంలో రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. గూడూరు వద్ద కైవల్యా నది ఉధృతంగా ప్రవహిస్తోంది.
- కోట మండలంలో స్వర్ణముఖి నది ఉధృతికి ఆనకట్టల నుంచి నీరు పరవళ్లు తొక్కుతున్నాయి.
- దొరవారిసత్రం తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద ప్రవాహం జోరందుకుంది. వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ పొంగడంతో వంతెనపైకి వరద నీరు చేరింది. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట-వాకాడు రోడ్డు వంతెనపై కన్న కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగి నది, పాల కాలువ, నెర్రి కాలువ, కన్న కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- వాకాడు మండలం దుగరాజపట్నం నుంచి కొండూరుపాళెం వెళ్లే రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. వాకాడు స్వర్ణముఖి బ్యారేజీలోకి 14 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 11 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు
- తడ మండలం కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, కారిజాత, కొండూరు, గ్రద్దగుంట గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి.
- గూడూరు చల్లకాలువ సమీపంలో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. పంటలు నీట మునిగాయి.
- చిట్టమూరు మండలం కొత్తగుంటలో వరినాట్లు నీట మునిగాయి.
- పెళ్లకూరు మండలం చిల్లకూరు, పెళ్లకూరు, పునబాక, కొత్తరు, అక్కగారిపేట, టెంకాయతోపు, భీమవరం, నెలబల్లి గ్రామాల్లో వందల ఎకరాల వరిపొలాలు నీటిపాలయ్యాయి.
- చిల్లకూరు మండలం పారిచర్ల వద్ద పొలాల్లోకి నీరు ప్రవేశించింది.
- సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు, దామరాయి, మంగళంపాడు, మన్నే ముత్తేరి గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి.
- కోట మండలం వెంకన్నపాలెం, తిమ్మానాయుడుపాలెం గ్రామాల్లో పంట పొలాలన్నీ నీట మునిగాయి.
- ఓజిలి మండలం పున్నేపల్లి-సుగుటూరు రోడ్డులో మామిడి కాలువ పొంగడంతో కాపులూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

దిశ మార్చుకున్న దిత్వా

● పుదుచ్చేరి వైపు కదులుతున్న వాయుగుండం
● మరో రెండు రోజులు భారీ వర్షాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి కొనసాగుతోంది. దిత్వా తుఫాన్ చెన్నై సమీపంలో వరకు ప్రయాణించి మళ్లీ పుదుచ్చేరి వైపు దిశ మార్చుకుంది. బుధవారం సాయంత్రానికి తీవ్ర అల్ప పీడనంగా బలహీనపడింది. ఈ ప్రభావంతో తిరుపతి జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షంతోపాటు గంటకు 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయవచ్చునన్నారు. మరో రెండు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ప్రమాదాలు... స్తంభించిన రాకపోకలు



గూడూరు మండలం విందూరులో ఆటోపై కూలిన విద్యుత్ స్తంభం

- పెళ్లకూరు మండలం పాలచ్చూరు దళితవాడలో ఓజిలి మణెమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. పునబాక వద్ద శ్రీకాళహస్తి-నాయుడుపేట ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బురదలో కూరుకుపోయింది. మామిడి కాలువ ఉధృతికి పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెంబేడు చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరుకుంది. నెలబల్లి చెరువు తూముకు ఇరువైపులా గండ్లు పడ్డాయి. రైతులు ఇసుక బస్తాలతో వాటిని పూడ్చే పనిలో పడ్డారు.
- తొట్టంబేడు మండలం కాసరంలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన రేణుకమ్మ(60) గుడిసెలో నిద్రిస్తుండగా గోడ కూలడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది.
- గూడూరు మండలం విందూరులో విద్యుత్ స్తంభం కూలి పడటంతో ఆటో ధ్వంసమైంది.
- కోట మండలం చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ నీట మునిగింది. ● చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. రొయ్యల కాలువ ఉధృతికి మల్లాం-నాయుడుపేట మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. తీర ప్రాంత గ్రామాలైన బురదగాలి, కొత్తపాలెం, కుమ్మరపాలెం గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.
- వాకాడు మండలంలో రొయ్యలకాలువ పొంగడంతో ముట్టెంబాక - చిట్టమూరు రోడ్డు తెగిపోయింది. స్వర్ణముఖి ఉధృతికి బాలిరెడ్డిపాలెం వద్ద వంతెనపైకి వరద నీరు చేరడంతో 16 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాయిలపాలెం నుంచి కొండూరుకు వెళ్లే రోడ్డుపైకి వరద నీరు రావడంతో రాకపోకలు నిలిపివేశారు.
- గూడూరు - రాజంపేట రోడ్డు వర్షానికి దారుణంగా దెబ్బతింది. ● కోట మండలం రుద్రవరం వద్ద మామిడి కాలువ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- చిల్లకూరు మండలం పారిచర్లవారిపాలెం వద్ద వరద నీరు కాజ్‌వే పైకి రావడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఉప్పుటేరు పొంగి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తిప్పగుంటపాలెం జల దిగ్బంధంలో చిక్కుకుంది.
- బాలాయపల్లి మండలం నిండలి సమీపంలో కైవల్యానది ప్రవాహం బ్రిడ్జిపైకి రావడంతో నిండలి, వాక్యం, దగ్గవోలు తదితర గ్రామాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకూ రాకపోకలు ఆగిపోయాయి.
- తడ మండలం పూడి గ్రామంలోకి నీరు ప్రవేశించింది. కారిజాత చెరువుకు గండిపడింది. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.

డీఆర్‌సీ సమావేశాలకు కార్పొరేషన్ చైర్మన్లు

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి కార్పొరేషన్ల చైర్మన్లకు జిల్లా సమీక్షా మండలి సమావేశాలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ ఈ సమావేశాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మాత్రమే పాల్గొనేవారు. ప్రస్తుతం అదనంగా కార్పొరేషన్ల చైర్మన్లకు కూడా ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ కూడా డీఆర్సీ సమావేశాల్లో పాల్గొననున్నారు. రెండు నెలలకొకసారి విధిగా డీఆర్సీ సమావేశం నిర్వహించాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

శబరిమల యాత్రలో విషాదం

● కారు ప్రమాదంలో తండ్రీకుమారుల మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమలైకు వెళ్లిన తండ్రీకుమారులు కారు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని కారణి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేణు(48) బేల్దారి కూలీ. కుమారుడు నరేష్(30) డ్రైవర్. వేణు, నరేష్, ఆయన కుమార్తె చాతుర్య అయ్యప్పస్వామి దీక్ష చేపట్టారు. ఈ నెల ఒకటో తేదీ ఉదయం వేణు, నరేష్, చాతుర్య(9)తో పాటు వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురానికి చెందిన మునితేజ కారణి గ్రామం నుంచి కారులో శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలోని తేని పట్టణ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే కూర్చున్న వేణు అక్కడికక్కడే మృతి చెందారు. మునితేజకు రెండు కాళ్లు విరిగిపోగా, చాతుర్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాలకు తేని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మునితేజ అక్కడే చికిత్స పొందుతున్నాడు. గురువారం మృతదేహాలు కారణి గ్రామానికి వస్తాయని తెలిపారు.



కాలువలో పడిపోయిన కారు

వేణు, నరేష్ మృతదేహాలు

వేడుకగా చొక్కాణి ఉత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది వద్ద బుధవారం రాత్రి చొక్కాని ఉత్సవం వైభవంగా సాగింది. తమిళ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవానికి ఒకరోజు ముందు అంటే మంగళవారం రాత్రి ఆలయంలో వేదపండితులు కలశస్థాపనతో కృతవును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అమ్మవారి సన్నిధి వద్ద బాలదీపాలను వెలిగించి స్వామివారి సన్నిధి వద్ద భద్రపరిచారు. బుధవారం రాత్రి వరకు దీపాలు నిరంతరాయం వెలిగేలా ఏర్పాటు చేశారు. ఉదయం మహానంది వద్ద వేదపండితులు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాటిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తాటిచెట్టును మహానంది వెనుకవైపున నిలబెట్టారు. చుట్టూ మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకువచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఈ ఘట్టాన్ని తిలికించేందుకు సాయంత్రం నుంచే భక్తులు వర్షంలో తడుస్తూనే నిరీక్షించారు. చొక్కాణి పూర్తయిన తర్వాత అందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయిలో మినీ కలెక్టరేట్లు

● పంచాయతీరాజ్‌లో కీలక సంస్కరణలు
● డివిజన్ స్థాయిలో ఒకే గొడుగు కిందకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు
● చిత్తూరు నుంచి డీడీవో కార్యాలయాలకు నేడు డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం

చిత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ సంస్కరణల్లో భాగంగా కూటమి ప్రభుత్వం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో)లకు విశేష అధికారాలను అప్పగించింది. డీడీవోల జాబ్‌చార్ట్‌ను మారుస్తూ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురానున్నారు. డివిజన్ స్థాయిలో ఉన్న పంచాయతీ ఆఫీసు (డీఎల్‌పీవో), డ్వామా ఏపీడీ, ఇతర శాఖల డివిజనల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మారుస్తున్నారు. డివిజన్ స్థాయిలో ఈ డీడీవో కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా ప్రజలకు సేవలందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీరాజ్ డివిజన్లను కూడా ఈ సబ్ డివిజన్లకు సమాంతరంగా ఏర్పాటు చేశారు. డీడీవోలకు కూడా అదే స్థాయిలో అధికారాలూ ఇచ్చారు. జిల్లాలో తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో డీడీవో కార్యాలయాలను గురువారం చిత్తూరు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు.

డీడీవో నియంత్రణలో..

డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలను డీడీవో నియంత్రిస్తారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు. పాలనాపరంగా ప్రతి నెలా 20 రోజులు పర్యటించి టూర్ డైరీలను కలెక్టర్లకు సమర్పించాల్సి ఉంటుంది. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బంది డీడీవో నియంత్రణలో పనిచేస్తారు.

స్థానిక ఎన్నికల బాధ్యత

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటివరకు డిప్యూటీ డిస్ట్రిక్ ఎలక్షన్ అథారిటీగా ఆర్డీవోలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరించనున్నారు. నిజానికి వైసీపీ హయాంలో పెద్దఎత్తున ఎంపీడీవోలను డీడీవోలుగా ప్రమోట్ చేశారు. అయితే ఒక్కరికీ సరైన పోస్టింగు ఇవ్వలేదు. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల్లోనే డీడీవోలకు ఓ ఛాంబర్ కేటాయించారు. మొత్తానికి డీడీవో వ్యవస్థ వైసీపీ హయాంలో సర్వేలు, నామమాత్రపు పర్యవేక్షణకే పరిమితమైంది.

శ్రీవారి సేవలో సినీ నటులు



సుధాకర్ - బబ్లూ, జస్వంత్ - రవి మోహన్, కెనీషా

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్ర ఎల్లా, చైర్మన్ కృష్ణా ఎల్లా, రాయలసీమ రేంజ్ ఏసీబీ జేడీ అశోక్‌కుమార్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తమిళ హీరో రవి మోహన్, గాయని కెనీషా, సినీ హీరో సుధాకర్, బిగ్‌బాస్ కంటిస్టెంట్, నటుడు జస్వంత్(జెస్సీ), నటుడు బబ్లూ ఉన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. జస్టిస్‌లకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,684

తలనీలాలు సమర్పించినవారు: 20,515



పంచాయతీరాజ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



తిరుపతిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ బుధవారం రాత్రి రూరల్ మండలంలోని శ్రీనివాసపురం, వేంకటపతినగర్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఏపీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్వర్ణపంచాయతీ యాప్‌ద్వారా నమోదు చేస్తున్న ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ వివరాలపై ఆరాతీశారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కాగా శ్రీనివాసపురం పంచాయతీలో అత్యధికంగా పన్నుల రూపంలో దాదాపు రూ.1.92 కోట్లు వసూలు చేయడంపై సంతోషం వ్యక్తపరిచారు. పన్నుల వసూలు బాగా చేశారని పంచాయతీ కార్యదర్శి మాధవిని ప్రత్యేకంగా అభినందించారు. డీపీవో సుశీలాదేవి, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్‌కు రూ.25వేల విరాళం



ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళం అందిస్తున్న జీవన్‌కుమార్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్లపల్లెకి చెందిన దివ్యాంగుడు జీవన్‌కుమార్‌రెడ్డి ఎన్టీఆర్‌ట్రస్ట్‌కు రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సీఎం చంద్రబాబు చేతులమీదుగా అందించినట్లు ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్ స్థాపించిన బర్డ్ ఆసుపత్రిలో తనలాంటి దివ్యాంగులు ఎందరికో వైద్యసేవలందించే విధంగా చంద్రబాబు చొరవచూపారని తెలిపారు. ఈ ఘనత టీడీపీ, ఎన్టీఆర్, చంద్రబాబులకు దక్కుతుందన్నారు. కాగా ప్రపంచ ఆరోగ్యసంస్థ 2014లో ప్రకటించిన పోలియోరహితదేశంలో బర్డ్ ఆసుపత్రి భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని, దీనికి కృతజ్ఞతగా తనవంతుగా ఎన్టీఆర్‌ట్రస్ట్‌కు విరాళం అందించినట్లు పేర్కొన్నారు. ఈయన్ను సీఎం అభినందించారు.

ఆది ప్రభుత్వ భూమి కాదు...

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి గ్రామ లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ 34, 37లలో ఉన్నది ప్రభుత్వ భూమి కాదని డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఈభూమిని 35 సంవత్సరాల క్రితం పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంతో కొనుగోలు చేసిందని, వాటి ద్వారా సివిల్ కోర్టు ఇచ్చిన డిక్రీ పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వుల ద్వారా సర్వహక్కులతో అనుభవంలో ఉందని పేర్కొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

పాకాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు కె బాబ్జీ, లింగయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులకు సరైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే సాధారణ పిల్లల్లా ఎదుగుతారన్నారు. జిల్లా స్థాయి ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పిల్లలందరికీ టిఫిన్ క్యారియర్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సహిత విద్య ఉపాధ్యాయురాలు సుందరి, సీజీవీ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి, సీఆర్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారిత పంటలవైపు మొగ్గు చూపాలి

భాకరాపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు డిమాండ్ ఆధారిత పంటల సాగు వైపు మొగ్గు చూపాలని చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖ అధికారి ఆషియా అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు రైతు సేవా కేంద్రంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పంచసూత్ర ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కుమార్ నాయక్, సిరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులు



ఎస్.హరినాథరెడ్డి, కె.శ్రీనివాసులు

రామచంద్రాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు ఎంపికయ్యారు. మండలంలోని రామాపురం పాఠశాలవద్ద మండల ఎస్టీయూ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా కె.పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.హరినాథ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా ఈ.హరిబాబు, సహాధ్యక్షులుగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగేశ్వర ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, రామాంజనేయులు, వాసు పాల్గొన్నారు.

గొల్లపల్లెలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం

తిరుపతిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్‌మండలం సి.గొల్లపల్లెలోని రైతుసేవాకేంద్రంలో ఎస్వీవ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని రైతులతో మమేకమై వ్యవసాయం లాభసాటికి ప్రభుత్వం చేపట్టిన పంచసూత్రాల లక్ష్యాలను వివరించారు. అలాగే దుర్గసముద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని లాభసాటి వ్యవసాయపంటల సాగుపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం

రామచంద్రాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, దీనివలన బాలికల ఆరోగ్యం కూడా క్షీణిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మనీల అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం బాలవివాహ ముక్త్‌భారత్ అవగాహన కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు మారయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రావణి, దేశమ్మ పాల్గొన్నారు.

కోలాహలంగా గంగమ్మ జాతర

● జన సంద్రమైన చంద్రగిరి



విశేషాలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



అమ్మవారికి హారతులు పడుతున్న మహిళలు



స్వర్ణముఖి వద్ద నాలుగు గంగమ్మలకు పూజలు

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణం, పాతపేటలో దిగువవీధి, ఆకుతోటవీధి, కొత్తపేటలోని జమండ్లవీధి, దాసరివీధుల్లో నాలుగు బలుల్లో గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్దవున్న గంగమ్మ నుండి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి త్రిశూలం, అమ్మవార్లను తీసుకొచ్చే పల్లెంను తీసుకొని దిగువవీధిలో గంగమ్మకు పూజలు నిర్వహించిన అనంతరం ఆకుతోటవీధికి చేరుకుంది. అక్కడ పూజల అనంతరం జమండ్లవీధికి, దాసరివీధికి వెళ్లి అక్కడ పూజలు నిర్వహించి స్వర్ణముఖి నదికి చేరుకున్నారు. అక్కడ సుమారు 15 అడుగుల లోతులో తవ్విన గోతిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇసుకతో పిడసల గంగమ్మ ప్రతిమలు నాలుగు తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి బుధవారం తెల్లవారు జామున విశేషంగా అలంకరించిన మూలస్థాన ఎల్లమ్మ ఉత్సవమూర్తితో పాటు వెనుకన నాలుగు గంగమ్మ ప్రతిమలు ఒకేసారి ఊరేగింపుగా బయలుదేరాయి. దీంతో చంద్రగిరి ప్రజలు, మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జంతుబలి ఇచ్చారు. అనంతరం అక్కడ నుంచి ఒక్కో బలికి అమ్మవారు చేరుకొంటూ, నాలుగు బలులకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. స్వర్ణముఖినది నుంచి అమ్మవార్లను తీసుకొచ్చే సందర్భంలో చంద్రగిరి టవర్ క్లాక్ వరకు సుమారు కిలోమీటరు దూరం జనం కిటకిటలాడారు. ఆయా బలుల్లో మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. చంద్రగిరి పట్టణం జనసంద్రమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బుధవారం రాత్రి నాలుగు బలుల్లో కొలువుదీరిన గంగమ్మ ప్రతిమలను తీసుకుని యువకులు, గ్రామస్తుల నడుమ కోలాహలంగా నూకలగుంటలో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పినపెద్దలు మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరూపాక్షి శంకర్‌రెడ్డి, మొక్కల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ

చంద్రగిరి పట్టణంలో గంగమ్మ జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారెను సమర్పించారు. చంద్రగిరి పట్టణంలోని దాసరివీధి, జమండ్లవీధి, ఆకుతోటవీధి, దిగువవీధుల్లోని గంగమ్మలకు సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గంగమ్మ జాతరకు నాలుగు బలులకు ఖర్చులకు రూ.లక్ష అందించారు. అదేవిధంగా తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి చంద్రగిరి పట్టణంలోని నాలుగు గంగమ్మలను దర్శించుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఎమ్మెల్యే నాని స్వర్ణముఖినదిలో గంగమ్మ ప్రతిమలు తయారుచేసే ప్రదేశానికి చేరుకుని, అక్కడ నుంచి నాలుగు గంగమ్మలతో కలిసి దిగువవీధి బలి వరకు వచ్చి, 9 గంటలకు అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ ఏనుగు మృతి



మంగళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):కాలు విరిగి నడవలేని స్థితిలో యాదమరి మండలం నుంచి తిరుపతిలోని ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి తరలిన 25 ఏళ్ల ఒంటరి ఏనుగు బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది.తమిళనాడు రాష్ట్రం నుంచి పదిరోజుల క్రితం యాదమరి మండలంలోకి ప్రవేశించిన ఈ ఏనుగు గత శనివారం యాదమరి మండలం కమ్మపల్లి అటవీ బీట్‌లోని గుడ్డివానిచెరువు వద్ద జారిపడడంతో కాలు దెబ్బతిని కదల్లేని స్థితికి చేరుకుంది. ఆదివారం అటవీశాఖ అధికారులు, వైద్యులు పరిశీలించి కుంకీ ఏనుగుల సాయంతో చెరువు నుంచి బయటకు తీసుకొచ్చారు.సోమవారం మధ్యాహ్నం భారీ క్రేన్ ద్వారా ఏనుగును లారీలో ఎక్కించి తిరుపతిలోని ఎస్వీ జూకు తరలించారు.అయితే గాయాలు మానడానికి వెటర్నరీ డాక్టర్లు చేసిన ప్రయత్నాలకు ఏనుగు శరీరం సహకరించలేదు. దీనికితోడు రక్తం విషపూరితంగా మారిపోవడంతో ఏనుగు మృతి చెందినట్లు వెటర్నరీ యూనివర్శిటీ పాథాలజీ విభాగం నిర్వహించిన పోస్టుమార్టంలో తేలిందని జూక్యూరేటర్ సెల్వం చెప్పారు. కళేబరాన్ని ఎస్వీ జూపార్కు ఆవరణలో చిత్తూరు అటవీ శాఖ అధికారులు, పశువైద్య బృందాల సమక్షంలో ఖననం చేశామన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూళ్లతో ప్రాథమిక విద్య బలోపేతం

● ఎంఏఎఫ్‌సీ తనిఖీలో వెల్లడి



మండల అకడమిక్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశంలో టీచర్‌కు సూచనలు చేస్తున్న ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం

ఎర్రావారిపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్లతో ప్రాథమిక విద్య బలోపేతమవుతోంది.ప్రతి తరగతికీ ఒక టీచర్ నియామకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను భారీగా చేర్పించారు.ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తుండడంతో సామరస్య పూర్వక బోధన, పోటీతత్వం బలపడి విద్యాప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. ఉదాహరణకు ఎర్రావారిపాలెం మండలంలోని 45 స్కూళ్లలో 7 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, 10 బేసిక్స్ పాఠశాలలు (1 నుండి 5 వరకు), 28 ఫౌండేషన్ స్కూల్స్ (1, 2 తరగతులు మాత్రమే) ఉన్నాయి.విద్యాభివృద్ధి తోడ్పాటుకు మండల అకడమిక్ మానిటరింగ్ కమిటీలను (ఎంఏఎఫ్‌సీ)ఈ యేడాది నుంచి ఏర్పాటుచేశారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టు నిపుణులతో కూడిన ఈ కమిటీ నవంబరు 25వ తేదీ నుంచి పలు పాఠశాలల్లో విద్యాప్రమాణాలను తనిఖీ చేస్తోంది. మోడల్ పాఠశాలల్లో వేగంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడినట్లు ఈ తనిఖీలు వెల్లడిస్తున్నాయి. బుధవారం కేజీబీ పాఠశాలలో తనిఖీలు చేపట్టిన కమిటీ సభ్యులు విద్యా ప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.5వ తరగతి పూర్తయ్యే నాటికి పొందవలసిన సామర్థ్యాలను మోడల్ ప్రైమరీ పాఠశాల పిల్లలు సాధిస్తున్నారని ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటాలు సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రోటరీ భవన్‌లో గూడూరు జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమాన్ని తీసుకువెళతామన్నారు. 20 రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేలా కార్యచరణను రూపొందించామని తెలిపారు. మొదటిగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని పట్టనంలోని ముత్యాలపేట సెంటర్‌లో బుధవారం ప్రారంభించామన్నారు. నియోజకవర్గం నుంచి 10వేలు పోస్టుకార్డులను పంపించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే అధికారుల అనుమతితో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో శాంతియుత నిరాహారదీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారిని ఆహ్వానించి నెలరోజుల పాటు రిలేదీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శశికుమార్, మణి, చంద్రయ్య, జమాలుల్లా, నారాయణ, సునీల్, సిసింద్రి, గౌస్‌బాషా పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం హైదరాబాద్‌లోని గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను స్వామివారి వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా తన స్వరాష్ట్రమైన త్రిపురలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని టీటీడీ చైర్మన్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరినట్టు చైర్మన్ కార్యాలయం తెలిపింది. త్రిపురలో శ్రీవారి ఆలయానికి స్థలం కేటాయిస్తే నిర్మాణాన్ని టీటీడీ చేపడుతుందని చైర్మన్ తెలిపినట్టు పేర్కొన్నారు. చైర్మన్‌తో పాటు టీటీడీ ఎల్‌ఏసీ మాజీ సభ్యుడు, శ్రీమాన్ గ్రూప్ ఎండీ అనూప్ చక్రవర్తి కూడా ఉన్నారు.

ముగిసిన 'రైతన్నా మీ కోసం'

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం ముగిసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఒక బృందంగా ఏర్పడి ప్రతి రైతు ఇంటికెళ్లి సీఎం పంచసూత్రాలపై అవగాహన కల్పించామన్నారు. సాగుచేసిన పంటల గురించి అభిప్రాయాలు సేకరించామని, ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత గురించి వివరించామని చెప్పారు. 1,60,145 రైతుల కుటుంబాలను కలిశామని వెల్లడించారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో నేరుగా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 -2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఎస్వీయూ డీడీఈ ఎంఏ పొలిటికల్ సైన్స్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫైనలియర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ రాజమాణిక్యం, ఎగ్జామ్స్ డీన్ సురేంద్రబాబు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యం

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్థశాఖ జిల్లా అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం సెర్ప్, పశుసంవర్థశాఖ ఆధ్వర్యంలో నారావారిపల్లెలో క్లస్టర్ పరిధిలోని మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకం, దేశ వ్యాలీ కోళ్ల పెంపకంలో మెలకువల గురించి, పాడిపశువులలో అధిక, నాణ్యమైన పాల ఉత్పత్తి, విలువ ఆధారిత పాల ఉత్పత్తుల గురించి రైతులకు వివరించారు. పశుసంవర్థశాఖ జిల్లా అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి గల అవకాశాలను తెలియజేశారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

రామచంద్రాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవోలు మార్కొండయ్య నాయుడు, జయవేలు ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు.

రెగ్యులర్ ఎంపీడీవోను నియమించండి

తిరుపతిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల రెగ్యులర్ ఎంపీడీవోని త్వరితగతిన భర్తీచేసి అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీడీవో రామచంద్ర బదిలీ జరిగి మూడునెలలు గడుస్తున్నా రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీచేయని పరిస్థితి ఉందని, దీనివల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పరిపాలనపై ప్రతికూల ప్రభావం కనిపిస్తోందని విమర్శించారు.

ప్రతి మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి

తిరుపతిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డ్వాక్రాసంఘాలలోని మహిళలు సుస్థిర జీవనోపాధిని ఏర్పరచుకుని ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. రూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయంలోని వెలుగు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల సమైక్య కార్యవర్గసభ్యులు, జిల్లాలోని 10 మండలాల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లకు జిల్లాస్థాయివిజన్(కల)మాడ్యూల్-1పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభిచారు. ఈనెల6వరకు శిక్షణ కొనసాగుతుంది.



కపిలతీర్థంలో దీపాలు పెడుతున్న భక్తులు



కపిలతీర్థం జలపాతం కొండ శిఖరంపై మహాదీపం వెలిగిస్తున్న గాండ్ల కులస్తులు

కపిలేశ్వరాలయంలో వేడుకగా కృత్తిక దీపోత్సవం

● శాస్త్రోక్తంగా జ్వాలాతోరణం

● ప్రత్యేక ఆకర్షణగా శివలింగాకృతి దీపాలంకరణ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరాలయంలో బుధవారం కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని కృత్తిక దిపోత్సవం వేడుకగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల గర్భాలయాల్లో, ఆలయ గోపురాలు, ధ్వజస్తంభంపై దీపాలు వెలిగించారు. ఊంజల్ సేవా మండపంలో కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. విశేష పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించారు. తర్వాత శివలింగం, త్రిశూలం ఆకృతిలో ప్రమిద దీపాలు వెలిగించారు. అనంతరం కోనేటి వద్ద తాళపత్రాలను ఏర్పాటు చేసి జ్వాలాతోరణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కపిలతీర్థం జలపాతం కొండపై కృత్తిక దీపం వెలిగించారు. అంజనేయ స్వామి సన్నిధి సమీపంలోని ఉద్యానవనంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కృత్తిక దీపోత్సవం, జ్వాలాతోరణం వీక్షించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



గాండ్ల కులస్తులచే మహాదీపం

కపిలతీర్థంలోని జలపాతం కొండ శిఖర భాగంలో గాండ్ల కులస్తులు బుధవారం మహాదీపం వెలిగించారు. ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం గాండ్లమిట్టవీధి భజన మందిరం నుండి నెయ్యి, నూనె సేకరించి భక్తిశ్రద్ధలతో ఈ దీపం పెట్టారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక మహేష్, శేఖర్, ప్రసాద్, బండారు శ్రీనివాసులు, దాము, రాజేంద్రప్రసాద్, జయకుమార్, పార్దు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ చైర్మన్, ఈవోలకు రూ.లక్ష విరాళం అందిస్తున్న ప్రకాష్ గుప్తా

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి బుధవారం స్థానిక శ్రీప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ సి.ప్రకాష్ గుప్తా రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో జయకుమార్‌కు అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలు అందించారు.

అంబేడ్కర్ వర్ధంతిని జయప్రదం చేయండి


మీడియాతో మాట్లాడుతున్న మేధావుల సంఘం అధ్యక్షుడు కుమార్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి పాత వెటర్నటీ ఆసుపత్రి సమీపంలోని తమ స్వగృహంలో ఈ నెల 6వ తేదీన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దళిత మేధావుల సంఘం అధ్యక్షుడు కుమార్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దళిత మేధావుల సంఘాన్ని నూతనంగా గత నెల 25వ తేదీన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తనను ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటరమణ, సుబ్బరత్న, కార్యదర్శిగా వై.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు తమ నూతన కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు.

అండర్‌బ్రిడ్జిల వద్ద వర్షపునీరు తొలగించండి

- కమిషనర్ ఎన్.మౌర్య


లోతట్టు ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల వలన అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు నిలవకుండా మోటార్లద్వారా ఎప్పటికప్పుడు పంపింగ్ చేయాలని, మ్యాన్‌హోల్స్ వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో అండర్ బ్రిడ్జిలను, లోతట్టు ప్రాంతాలను కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. కూలిపోయే స్థితిలో ఉన్న భవనాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తొలగించాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన అన్నిఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా 0877-2256766, 9000822909 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డీఈలు మధు, మహేష్ తదితరులు ఉన్నారు.

హిందూ దేవుళ్లను హేళనచేస్తే సహించేదిలేదు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను హేళనచేస్తే సహించేదిలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి టీటీడీ ట్రస్ట్‌ట్రస్ట్‌బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. హిందూ సంప్రదాయాలను కించపరుస్తూ అవమానకరంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లా, జీసస్‌లను విమర్శించే ధైర్యం రేవంత్‌కు ఉందా అని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలను తక్షణం వెనక్కుతీసుకుని హిందువులకు క్షమాపణ చెప్పాలని భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎస్వీ వైద్య కళాశాల పీజీ విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన పీజీ వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పీజీ పరీక్షల్లో ఎస్వీ వైద్య కళాశాల పీజీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం ఎంతో అభినందనీయమని ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అక్టోబరులో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించడం అభినందనీయమన్నారు. బయోకెమిస్ట్రీ విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ స్నేహ, ద్వితీయస్థానంలో డాక్టర్ మౌనికా, ఫార్మకాలజీ విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ ఎం.శ్రీలక్ష్మీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ జనని, 5వ స్థానంలో డాక్టర్ అరవింద్, సైకియాట్రీ విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ సుహాని, పిడియాట్రిక్స్ విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ కె.ఎస్.పవిత్ర, ద్వితీయస్థానంలో డాక్టర్ శరణ్య మురుగేషన్, నేత్ర విభాగంలో ప్రథమస్థానంలో డాక్టర్ బి.శ్రావణి ఉత్తమ మార్కులతో రాణించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన పీజీ వైద్య విద్యార్థులను ప్రిన్సిపాల్ రవిప్రభుతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, డీఎస్ఎన్ మూర్తి, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

తిరుపతి(ఆటోనగర్)/తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వేమన విజ్ఞాన కేంద్రం నైపుణ్య శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రం కన్వీనర్ ఎం.నాగార్జున, పర్యవేక్షకులు ముఖేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీసు, కంప్యూటర్ బేసిక్, ట్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ తదితర కోర్సులకు తక్కువ ఫీజుతో ఉత్తమ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. పూర్తివివరాలకు 99857 86146, 89850 80370 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 31 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుపతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి ఎదుట హాజరు పరచారు. వీరిని విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10,000 వంతున దాదాపు రూ.3.10 లక్షల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వీరితో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నడిరోడ్లపై వ్యాపారాలు చేస్తున్న మరో 25 మందికి నోటీసులు జారీ చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.500 వంతున మొత్తం రూ.12,500 జరిమానా విధించారు.

టీడీఆర్ బాండ్లతో బీపీఎస్ చేసుకోండి

- అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా నగరంలో భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ తరువాత జరుగుతున్న అన్ని భవన నిర్మాణాలపై శాటిలైట్ నిఘా ఉందని తెలిపారు. ఈ మేరకు ఎవరైనా నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు, అదనపు అంతస్థుల నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అదనపు అంతస్థుల నిర్మాణం చేయాలనుకుంటే నిబంధనల మేరకు టీడీఆర్ బాండ్లను వినియోగించి చేసుకోవచ్చని తెలిపారు. ఏవైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగి ఉంటే బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బిపిఎస్) ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు.

- అక్రమ నిర్మాణాల తొలగింపు

బుధవారం తిరుమల బైపాస్ రోడ్డు, ఎన్జీవో కాలనీలో అనధికార అదనపు అంతస్థు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఆదేశాల మేరకు పరిశీలించామని డీసీపీ ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాటిని తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ అధికారులకు టీడీపీ సన్మానం


వీసీ నరసింగరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును టీడీపీ నాయకులు సన్మానించారు. బుధవారం రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, నగరపాలక డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, శ్రీవారి ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, ఎన్ఎంఆర్ అసోసియేషన్ నాయకులు జగదీష్, వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రామ్మోహన్, వెంకటేష్ నాయుడు, కుసుమ, ఆర్కే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపిలేని వర్షం
రుయాలో రోగుల అగచాట్లు

- సాయంగా నిలిచిన సిబ్బంది



గొడుగుమాటున చిన్నారులు, వీల్‌చైర్‌లో వృద్ధుడు



వర్షంలో తడుస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు బుధవారం రుయాస్పత్రిలోని రోగులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఆస్పత్రిలో ఓపీ వార్డు, వైద్యపరీక్షల కేంద్రాలు, వార్డులు దూరం దూరంగా ఉండటంతో జోరుగా కురుస్తున్న వర్షానికి రోగులు అటు ఇటు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ప్రధానంగా చంటిబిడ్డలతో వచ్చిన వారు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందిపడ్డారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులు సైతం చలిగాలులకు ఇబ్బందిపడ్డారు. నడవలేని స్థితిలో ఉన్న కొందరు వృద్ధులకు, రోగులకు నర్సింగ్ విద్యార్థులు, మరికొంత మంది సిబ్బంది సాయంగా నిలిచి వారిని వర్షంలో నుంచి వార్డుల వద్దకు తీసుకువెళ్లి విడిచిపెట్టారు. రుయాస్పత్రిలో రోగుల సహాయకుల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తికాకపోవడంతో రోగుల సహాయకులు ఉండేందుకు ఆస్పత్రిలో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ భవనాన్ని త్వరగా పూర్తి చేస్తే కొంత ఊరటగా ఉంటుందని రోగుల సహాయకులు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం

- మాజీ మంత్రి పరసారత్నం


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరసారత్నం

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని మాజీ మంత్రి పరసారత్నం పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ కల్పించిన అవకాశాలతో ప్రస్తుతం దళితులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇంకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అభివృద్ధి మాత్రం సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అంబేడ్కర్, పూలే ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. టీటీడీ విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచడంలో తమ సంస్థ కీలక పాత్ర పోషించిందని వివరించారు. ఈ నెల 6వ తేదీన అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కచ్చపి ఆడిటోరియంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ సభ్యులు కుమార్, జగదీష్, రాజేంద్ర, శంకరయ్య, సతీష్‌చంద్ర, నారాయణ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- సీపీఎం మాజీ ఎంపీ పి.మధు


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పి.మధు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ అంటూ రైతుల వద్దకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేసుకొంటున్నారే తప్పా, వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం మాజీ ఎంపీ పి.మధు విమర్శించారు. స్థానిక యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించ పోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం 23 రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని ప్రకటించి నేటి వరకు అమలుచేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. పత్తి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, మామిడి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో కూటమి నాయకులు అన్నదాతల వద్దకు వెళ్లి సుఖీభవా అంటూ దీవించడమంటే ఆత్మవంచన చేసుకోవడమేనన్నారు. రైల్వే స్టేషన్లలో రైళ్లు వచ్చిన సమయంలో ఏర్పడిన రద్దీకి తగిన విధంగా మౌలిక వసతులు కల్పించాలని, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలో ఆ పార్టీ నాయకులు కందారపు మురళి, జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


మాట్లాడుతున్న రాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమెన్ స్టడీస్ ప్రతినిధి రాణి మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో నైపుణ్యాలు పెంచాలన్నారు. వైద్య, విద్య, ఉపాధి, రవాణా, సాంకేతిక సహకారం అందిస్తే వారు బాగా రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి


మీడియాతో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాల్సిన అవసరముందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేటు పరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశ సంక్షేమం కోసం తాను పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన బాగుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ఎందుకు నోరుమెదపడం లేదని నిలదీశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మేధావులు, ప్రజలు సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు జంగాలపల్లి శుభాకరరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరుచేయాలి


బ్యాంకర్స్‌తోమాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ మౌర్య

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్వయం సహకార సంఘాల మహిళలకు, వ్యవసాయ, పాడిరైతులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఇన్‌ఛార్జి జేసీ మౌర్య అన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రాప్ లోన్‌కు అర్హత కలిగిన లబ్ధిదారులకు క్రాప్ ఇన్సూరెన్సు వర్తించేవిధంగా చూడాలన్నారు. వివిధ పథకాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించి రుణాలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, లీడ్‌బ్యాంకు మేనేజరు రవికుమార్, ఇతర అధికారులు ప్రసాద్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడని వాన.. తప్పని తిప్పలు


కపిల తీర్థంలో వర్షానికి ఇబ్బందులు పడుతున్న భక్తులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో నగరంలో గడిచిన కొన్ని రోజులుగా జోరు వర్షం కురుస్తోంది. బుధవారం మరింత ఎక్కువైంది. హోరుగాలులతో పాటు పొగమంచు కమ్మేసింది. చలితీవ్రత బాగా పెరిగింది. ఓ పక్క వర్షం, మరో పక్క చలితో ప్రజలు గజగజమని వణికిపోయారు. విద్యార్థులు, వాహనచోదకులు తడిసి ముద్దయ్యారు. బస్టాండు, రైల్వేస్టేషన్, ఇతర సందర్శక ప్రాంతాల్లో జనసంచారానికి సమస్యలు ఎదురయ్యాయి. వీధివ్యాపారాలు మూతబడ్డాయి. ప్రధాన మార్కెట్ బురదతో రొచ్చురొచ్చుగా తయారైంది. పురవీధుల్లో ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. మురుగుకాలువల వ్యర్థాలతో నిండిపోయి రోడ్లపైకి వ్యాపించాయి. అత్యవసర పరిస్థితుల్లో గొడుగులు, రెయిన్‌కోట్స్ ధరించి రాకపోకలు సాగించారు. శేషాచలం నుంచి దూకుతున్న జలపాతాలు, ఊటీని తలపిస్తూ ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. గురువారం కూడా భారీ వర్షాలు కురవనున్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి.

6న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఈ నెల 6 వ తేదీన జాబ్ మేళా జరగనుంది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్, అపోలో ఫార్మసీ, జెప్టో, టాటా ఎలక్ట్రానిక్స్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ తదితర సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమో చదువుకున్న వారు అర్హులు. సుమారు 600 ఉద్యోగాల భర్తీకి ఈ మేళా చేపట్టనున్నారు. రూ.14 వేల నుంచి రూ.35 వేల దాకా వేతనం అందిస్తారు. 6వ తేదీన ఉదయం 10 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఈ మేళా ప్రారంభం కానుంది.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి రూ.37.40లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం రఘునాథరిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని బాధితులకు పంపిణీ చేశారు. అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడుతున్న ఆర్‌సీపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం, తిరుపతి, చంద్రగిరి రూరల్ మండలాలకు సంబంధించి పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న బాధితులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

కుక్కల బెడదను అరికట్టండి

మున్సిపల్ కమిషనర్‌కు చైర్మన్ వినతి



పుత్తూరు అర్బన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కల బెడదను నియంత్రించాలని మున్సిపల్ కమిషనర్ డి.వి.నాగేశ్వరరావుకు మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్ వినతిపత్రం సమర్పించారు. కోతుల బెడద కూడా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏకాంబరం, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో అన్నదానం

పుత్తూరు అర్బన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని మున్సిపల్ మాజీ చైర్మన్ అమ్ములు పేర్కొన్నారు. బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని పడివాడవీధిలో కొలువుదీరిన శ్రీసెల్వ వినాయక ఆలయంలో అన్నదానాన్ని చేపట్టారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరుకు

రైల్వే మంత్రి సానుకూల స్పందన



పుత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెండింగులో ఉన్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వెంటనే మంజూరు చేయాలని బుధవారం కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎంపీ గురుమూర్తి కోరారు. మాజీ మంత్రి రోజా అందించిన ప్లాన్, ఫొటోలు, రెండేళ్ల కిందట నాటి నేటి కేంద్రమంత్రిని కలిసి అందజేసిన పత్రాలను ఈ సందర్భంగా మంత్రికి ఎంపీ అందించారు. బ్రిడ్జి నిర్మాణంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

పుత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో కూడా రాణిస్తున్నారని సీనియర్ న్యాయవాది మురుగారెడ్డి తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం మదర్ థెరిస్సా బధిర పాఠశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా విభిన్న ప్రతిభావంతులు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ కఠారి శివయ్య, సుబ్రమణ్యం, సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

పుత్తూరు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక దీపోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జామున శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద ప్రమిదలతో నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పుత్తూరు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మండలంలోని గూళూరు చెరువు మీదుగా వెళ్ళే విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో ఎగువ గూళూరు, దిగువ గూళూరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విద్యుత్ అధికారులు బోటు వెళ్లి తెగిన విద్యుత్ తీగలను తగిలించి సరఫరాను పునరుద్ధరించారు.

అండర్ బ్రిడ్జిలో నీటి తొలగింపు

పుత్తూరు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మండలంలోని తడుకు గ్రామం వద్ద అండర్ బ్రిడ్జిలో నీరు చేరిపోవడంతో తడుకు ఎగువ గూళూరు, దిగువ గూళూరు, శిరుగురాజపాలెం, పొట్టిగుట్లలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై గ్రామస్తులు ఎంపీడీవో పద్మావతికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సిబ్బందితో అండర్ బ్రిడ్జి వద్దకు చేరుకుని మోటారు ద్వారా నీటిని తొలగింప జేశారు.

పుత్తూరులో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

● అలరించిన యాంకర్ అనసూయ భరద్వాజ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనసూయ

పుత్తూరు అర్బన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 22వ స్టోర్‌ను సినీనటి, ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అధునాతన కలెక్షన్లతో నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందన్నారు. ఈ స్టోర్‌ను పుత్తూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆమె కాసం షోరూంలో కలియతిరిగి సందడి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 22 స్టోర్లు ప్రారంభించినట్లు షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ పేర్కొన్నారు. ఇక షోరూం ప్రారంభోత్సవానికి సినీనటి అనసూయ వస్తుందని తెలుసుకున్న అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పుల్లూరు అరుణ్‌కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, కాసం ఫణీత్, కాసం సాయికృష్ణ, యాంసాని ప్రవీణ్ పాల్గొన్నారు.

సంయుక్త విద్యా విధానంతో సర్వతో ముఖాభివృద్ధి

పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ చిన్నారులు సంయుక్త విద్యా విధానంతో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని ఎంఈవో యుగంధర్ రాజు తెలిపారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో జరిగిన పారా క్రీడల్లో పిచ్చాటూరు భవిత కేంద్రం నుంచి ఏడుగురు పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఎంఈవో బాబయ్య, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ప్రత్యేక ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటేష్, మదన్, సిబ్బంది జగదా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పిచ్చాటూరు విద్యార్థులు

పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అండర్-14 నెట్‌బాల్ జాతీయ స్థాయికి ఎంపికైన పిచ్చాటూరు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

ఏఐసీసీ పరిశీలకురాలికి సాదర స్వాగతం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పరిశీలకురాలు, ఎంపీ సుధారామకృష్ణన్‌కు బుధవారం తిరుపతి విమానాశ్రమంలో కాంగ్రెస్ నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆమె వెంకటగిరి నియోజకవర్గ సమీక్షా సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి స్వాగతం పలికారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధ్యాపకులు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎస్సీవీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆర్‌ఆర్‌సీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వీడని వాన



చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాళెం సమీపంలో చప్టాపై వరద

● గ్రామాలు జలమయం
● నీటమునిగిన పొలాలు
● రోడ్లు, చప్టాలపై వరద
● ఆగిన రాకపోకలు



గూడూరు మండలం విందూరు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి వీడని వానతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బుధవారం ఉదయం తేలికపాటి జల్లులు పడినా మళ్లీ సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం, సాయినగర్ ముంపు ప్రాంతాలను తహసీల్దారు గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. మన్నెముత్తేరి - ఉల్లాపడవ మార్గంలో వంతెనపైకి వర్షపునీరు చేరింది. కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో భారీగా వరదనీరు చేసి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో అన్ని చెరువులు నిండుకుండలను తలపిస్తూ ప్రమాదపుటంచుకు చేరాయి. ముందు జాగ్రత్తగా మంగళంపాడు చెరువుకు రైతులు గండికొట్టి నీటిని బయటకు పంపిస్తున్నారు. అధికారులు మాత్రం అన్ని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మంగళంపాడు - ఇలుపూరు మధ్య దొండకాలువ వంతెనపై వర్షపునీరు రెండు అడుగుల మేర నీరు పారుతుండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

పెళ్లకూరు: దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలోని స్వర్ణముఖినది, మామిడికాలువతో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. స్వర్ణముఖినది లోతట్టు ప్రాంతాలైన కలవకూరు, యడపూడి, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పాలచ్చూరు, జంగాలపల్లి, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల తదితర గ్రామాలు జలమయం అయ్యాయి. ఇళ్ల చుట్టూ నీళ్లు ఉండడంతో బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వందలాది ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. పాలచ్చూరు మామిడికాలువ, కలవకూరు కాజ్‌వేలను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ హరికృష్ణ పరిశీలించారు. ఆయా కాజ్‌వేలపై రాకపోకలను నిషేధించారు. పాలచ్చూరు గ్రామంలో ఓజిలి మణెమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. అలాగే నెలబల్లి చెరువుకట్ట బలహీనపడడంతో ఇరిగేషన్ డీఈ కిలారి విశ్వనాథ్, ఏఈ బొప్పన శ్రీనివాస్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, సాగునీటి చెరువు ఆయకట్టు చైర్మన్ చిల్లకూరు మాధవరెడ్డి, కురిమేటి ఉదయ్ నాయుడు పరిశీలించారు. ఇసుక బస్తాలు వేసి మరమ్మతులు చేపట్టారు.

నాయుడుపేట టౌన్: ఎడతెరపిలేని వర్షంతో ఎగువప్రాంతం నుంచి స్వర్ణముఖి, మామిడికాలువకు భారీగా వరదనీరు చేరుతోంది. చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. ఇలాగే వర్షం కొనసాగితే చెరువులకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని విన్నమాల రహదారి, రాజగోపాల పురం, అగ్రహారపేట రోడ్లు జలమయమయ్యాయి. కాపులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి భారీగా వర్షపునీరు చేరుకోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు.



నాయుడుపేట: కాపులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో బయటకెళ్లడానికి విద్యార్థుల ఇబ్బందులు

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖి వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో 16 గ్రామాలకు రాకపోకలకు ఆగిపోయాయి. తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ ఎక్స్‌కవేటర్ సాయంతో వంతెనకు ఇరువైపులా మట్టి పోయించారు. రొయ్యల కాలువ ఉప్పొంగడంతో ముట్టెంబాక నుంచి చిట్టమూరుకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. వరదనీటి కారణంగా ముట్టెంబాక, దుగ్గవరం, తిరుమూరు, వావిళ్లపాళెం, కల్లూరు కొత్తపాళెం, కొండూరు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. దుగరాజపట్నం కొండూరుపాళెం, వావిళ్లపాళెం - కొండూరుకు రహదారులపై వరద ప్రవాహం కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. స్వర్ణముఖి బ్యారేజీని ఇరిగేషన్ ఈఈ బాబు పరిశీలించారు. 14వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో 11 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

దొరవారిసత్రం: దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలాన్ని వర్షం ముంచెత్తింది. మంగళవారం రాత్రి, బుధవారం భారీ వర్షం కురవడంతో కాళంగి నది, కన్నకాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తనియాలి వద్ద కాళంగి నది వంతెనపై వరదనీరు ప్రవహిస్తుండడంతో తనియాలి, కమ్మకండ్రిగ, బూదూరు, మంగానెల్లూరు, తిమ్మనాయుడు కండ్రిగకు రాకపోకలు ఆగిపోయాయి. అలాగే కుప్పారెడ్డిపాలెం సమీపంలో వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ వంతెనపై వరద ప్రవాహంతో అవతల వైపునున్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పూలతోట సమీపంలో ఉన్న కన్నకాలువ వంతెనపై వరద ప్రవాహంతో సూళ్లూరుపేట - కోట మార్గాల వైపు రాకపోకలు ఆగిపోయాయి.

కోట: భారీ వర్షాలతో మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలు అతలాకుతలమైపోయాయి. గోవిందపల్లి వద్ద ఉన్న బకింగ్‌హమ్ కెనాల్‌లో ఆటుపోటులు పెరిగి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో మత్స్యకార గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు ఎప్పటికప్పుడు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అదే విధంగా వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, కాకితోపు, తిన్నెలపూడి, కొక్కుపాడు గ్రామాల్లోని వరి నారు మడులు, పైర్లు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గూడలి, తిన్నెలపూడి వద్ద ఉన్న స్వర్ణముఖినది, మామిడికాలువలు వరదతో పరవళ్లు తొక్కుతూ ఉప్పొంగుతున్నాయి. రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల మధ్య మామిడికాలువ ఉప్పొంగడంతో ఆ గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. చెందోడు సబ్‌స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వెంకన్నపాళెం, రాఘవాపురం, కేశవరం గ్రామాల్లో సాగులో ఉన్న పుచ్చ, వంగ పంటలు దెబ్బతిన్నాయి. కోట క్రాస్‌రోడ్డులోని మిల్లులో నిల్వ ఉంచిన వందలాది టన్నుల బియ్యం తడిచిపోయాయి. కోట మండలంలోని స్వర్ణముఖినది పొర్లుకట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉండటంతో అల్లంపాడు, పుచ్చలపల్లి, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయం గుప్పెట్లో ఉన్నారు. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ సురక్షిత ప్రాంతాలకు వెళ్లలేదు. దీంతో దైవాలదిబ్బ గ్రామస్తులను బలవంతంగా కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు తరలించారు.

గూడూరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో పాటు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో పంబలేరు వాగు పొంగి ప్రవహించింది. మండలంలోని విందూరు, వేములపాళెం చప్టాలపై వరదనీరు ప్రవహించడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో మిటాత్మకూరు, ఈదలపల్లి, పగడాలపల్లి, సంతదాసుపల్లి, చంబడిపాళెం, రామలలింగాపురం, విందూరు గ్రామాల నుంచి గూడూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పట్టణంలోని పంబలేరు చప్టాపై వరదనీరు ఉధృతంగా ప్రహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేసి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని విందూరు, మిటాత్మకూరు, సంతదాసుపల్లి, పట్టణంలోని పంబలేరు సమీపంలోని, చల్లకాలువ సమీపంలోని పంటపొలాల్లోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం నార్లు పోసివుండడంతో ఇక ముందు వర్షాలు పడితే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విందూరు గ్రామంలోని ముస్లిం వీధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ స్థంభం విరిగి పడడంతో ఓ ఆటో ముందు ధ్వసమైంది.

చిల్లకూరు: మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం చప్టాలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు నుంచి ప్రవహించే పంబలేరువాగు తిప్పగుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరులో కలిసి గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి చేరుతుంది. తిప్పగుంటపాలెం చప్టాపై నీరు ప్రవహించడంతో ఆ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. అధికారులు బోట్లును అడ్డగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో పారిచెర్లవారిపాళెం సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తోంది. తహసీల్దారు శ్రీనివాసులు చప్టాను పరిశీలించారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలను నిలిపివేసి భారీ వాహనాలు మాత్రమే అనుమతిస్తున్నారు. పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి.

వెంకటగిరి టౌన్: దిత్వా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. వెలుగొండల అడవుల్లో నుంచి వచ్చే వరదతో కైవల్యానది ప్రవాహం ఎక్కువగా ఉంది. అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల పాటు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సీఐ రమణ, తహసీల్దార్ నరసింహారావు కోరారు.

తడ: దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం తడలో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి చెదురుమదురుగా జల్లులు కురవగా, బుధవారం సాయంత్రం తరువాత భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మాంబట్టు, వెండ్లూరుపాడు, కారిజాత, కాదలూరు, వాటంబేడు, గ్రద్దగుంట, కొండూరు గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల వరకు వరిపంట నీళ్లలోనే ఉండిపోయింది. పూడి గ్రామంలో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో జాతీయ రహదారి అధికారులు నీటిని మళ్లించే ప్రయత్నం చేశారు. పెరియవట్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీళ్లు చేరడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కారిజాత చెరువుకు గండిపడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెరువు కలుజుకు ఆనుకొని ఉన్న కట్ట తెగిపోయింది. చెరువులోని నీళ్లు పొలాలమీదుగా పులికాట్‌లోకి వెళ్తున్నాయి.



సూళ్లూరుపేట: దొండకాలువ వంతెనపై వరదనీరు ప్రవహిస్తుండడంతో మంగళంపాడు గ్రామస్తుల అవస్థలు







తడ మండలంలోని కాదలూరు, వాకాడు మండలంలోని కోడివాక వద్ద నీటి మునిగిన పొలాలు - కోట మండలం తిమ్మానాయుడుపాళెం వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటాలు సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రోటరీ భవన్‌లో గూడూరు జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమాన్ని తీసుకువెళతామన్నారు. 20 రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేలా కార్యచరణను రూపొందించామని తెలిపారు. మొదటిగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని పట్టణంలోని ముత్యాలపేట సెంటర్‌లో బుధవారం ప్రారంభించామన్నారు. నియోజకవర్గం నుంచి 10వేలు పోస్టుకార్డులను పంపించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే అధికారుల అనుమతితో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో శాంతియుత నిరాహారదీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారిని ఆహ్వానించి నెలరోజుల పాటు రిలేదీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శశికుమార్, మణి, చంద్రయ్య, జమాలుల్లా, నారాయణ, సునీల్, సిసింద్రి, గౌస్‌బాషా పాల్గొన్నారు.

దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

తహసీల్దారు కార్యాలయ సమీపంలోనే ఆక్రమణ

చోద్యం చూస్తున్న అధికారులు

ఎమ్మెల్యే జోక్యంతో చర్యలకు ఉపక్రమణ



ప్రభుత్వ స్థలానికి కంచె వేసిన ఆక్రమణదారులు

వెంకటగిరి, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని అమ్మవారిపేట సర్వే నంబర్ 215లో ఉన్న సుమారు 30 సెంట్ల ప్రభుత్వ అనాదీన భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కంచె వేశారు. దీనిపై డక్కిలి మండలం లింగసముద్రం మాజీ సర్పంచ్ వేముల నాగయ్య నాయుడు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేసినా రెవెన్యూ సిబ్బంది స్పందించడం లేదని ఎమ్మెల్యే ఎదుట నాగయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణంలో విలువైన స్థలాన్ని కబ్జా చేస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. కబ్జాకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను వెంటనే తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దారు నరసింహారావును, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని ఆదేశించారు. కాగా, ఈ విషయమై తహసీల్దారు స్పందిస్తూ ఆక్రమణకు గురైన అమ్మవారి పేట సర్వే నంబర్ 215లోని భూమి రెవెన్యూ పరిధిలోని రాదని తెలిపారు. అలాగే మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా సదరు స్థలంతో తమ శాఖకు సంబంధం లేదని, అయినప్పటికీ పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలను తొలగించేందుకు గురువారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు దివ్యాంగుల ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5న దివ్యాంగుల ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. 18నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి శారీకర, వినికిడి లోపం ఉన్న దివ్యాంగులు జాబ్ మేళాలకు హాజరుకావచ్చన్నారు.

6న డీఆర్‌డబ్ల్యు కళాశాలలో...

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 15పైగా బహుళజాతి కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన వారు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9700561225, 8639835953 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాపూజీ కాలనీలో గిరిజనులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, మునస్వామి, శ్రీధర్, వెంకీ యాదవ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

పెళ్లకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి నాటే సమయం నుంచి సస్యరక్షణ చర్యలు పాటించాలని తిరుపతి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త భార్గవరామిరెడ్డి సూచించారు. వ్యవసాయశాఖ, ఆత్మ సౌజన్యంతో నాయుడుపేట డివిజన్ ఏడీఏ నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలంలోని నెలబల్లి రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ భారతి, వీఏఏ సుమతి, స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు చిల్లకూరు మాధవరెడ్డి, సర్పంచు కమలమ్మ, టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమ నాయుడు, కురిమేటి ఉదయ్‌కుమార్ నాయుడు, ఎల్లంకి నరేంద్రనాయుడు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ గురుకులంలో విద్యార్థినులకు శ్రీకృష్ణసేవాసమతి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో రజనీకుమారి, మస్తానయ్య, దినేష్‌రెడ్డి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషోంధర్ అభినందించారు.

ఆగమోక్తంగా చొక్కాని సంకల్ప పూజలు






శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి, చొక్కాని ఉత్సవాల్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో పౌర్ణమి రోజున రాత్రి చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలోని పెద్దనంది విగ్రహం వద్ద సంకల్ప పూజలు చేశారు. అనంతరం తాటిచెట్టును నెలబెట్టి పూజలు చేశారు.

పళ్లికొండేశ్వరుడి ఆలయంలో చొక్కాని ఉత్సవం



నాగలాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవం సందర్భంగా చొక్కాని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తీకేశన్ గురుకుల్ ఆధ్వర్యంలో సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి సమేత మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రదోష మండప ఆవరణలో ప్రతిష్ఠించి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో, పుష్పాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి మహాదీపారాధన చేపట్టారు. అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా ఆలయం వెలుపలకు వేంచేపు చేశారు. ఉత్సవంలో భాగంగా వెలుపల చొక్కాని ముందు ప్రతిష్ఠించారు. అనంతరం జ్యోతిని వెలిగించి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ప్రదోష మండప ఆవరణలో శివ లింగాకారంలో నేతి దీపాలను వెలిగించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

హిందూ దేవుళ్లను హేళనచేస్తే సహించేది లేదు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి ● టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను హేళనచేస్తే సహించేదిలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేంత్‌రెడ్డిని ఉద్దేశించి టీటీడీ ట్రస్ట్‌ట్రస్ట్‌బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. హిందూ సంప్రదాయాలను కించపరుస్తూ అవమానకరంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లా, జీసస్‌లను విమర్శించే ధైర్యం రేవంత్‌కు ఉందా అని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలను తక్షణం వెనక్కుతీసుకుని హిందువులకు క్షమాపణ చెప్పాలని భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరుచేయాలి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జేసీ మౌర్య

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్వయం సహకార సంఘాల మహిళలకు, వ్యవసాయ, పాడిరైతులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఇన్‌ఛార్జి జేసీ మౌర్య అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రాప్ లోన్‌కు అర్హత కలిగిన లబ్ధిదారులకు క్రాప్ ఇన్సూరెన్సు వర్తించేవిధంగా చూడాలన్నారు. వివిధ పథకాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించి రుణాలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, ఇతర అధికారులు ప్రసాద్, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు డీడీవో కార్యాలయం ప్రారంభం



శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డివిజన్ డెవలప్ మెంట్ అధికారి కార్యాలయాన్ని ఈనెల 4న గురువారం ప్రారంభించ నున్నట్లు తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉదయం 11గంటలకు వర్చువల్‌గా డీడీవో కార్యాలయాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ డీడీవో కార్యాలయం తొట్టంబేడు ప్రాథమిక వైద్యశాలకు సమీపంలో ఉన్న జీవనోపాధుల వనరుల శిక్షణ కేంద్ర భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అరణియార్ ప్రాజెక్టు పరిశీలన



పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ రిజర్వాయర్‌ని ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారురు. ప్రాజెక్టులో 30 అడుగులు నీటిమట్టం దాటుతుండడంతో గేట్లు ఎక్కువగా ఎత్తితే దిగువన ఉన్న ప్రజలకు అపాయం, పొలాలు నీట మునిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కీళపూడి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు డిల్లీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయం

రైతుల మండిపాటు

పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే రూ.200లకు ఎరువులను విక్రయించడంపై రైతులు వ్యవసాయ అధికారులను నిలదీశారు. ముడియూరు సచివాలయంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో రైతు గోవర్ధన్ మాట్లాడుతూ రైతుకు సకాలంలో యూరియా అందించకపోవడంతో పాటు డీలర్లు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు చేపడతామని వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి చెప్పారు. యూరియా కూడా మోతాదుకు మించి వినియోగించవద్దని ఏవో సూచించారు. త్వరలో 450 మూటల యూరియా సచివాలయాలని చేరుతుందన్నారు. అగ్రికల్చర్ ఏడీ సుబ్రహ్మణ్యం, సైంటిస్టు ప్రియా, పశు వైద్యాధికారిణి స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

తూర్పున కుండపోత

నీట మునిగిన వరి ● కలుజులు పారుతున్న చెరువులు





శ్రీకాళహస్తి ధర్మరాజస్వామి ఆలయం వద్ద జోరుగా కురుస్తున్న వర్షం - నెరణికండ్రిగలో నీటమునిగిన వరి - ఉబ్బలమడుగు కలుజు పరిశీలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం విడిచి విడిచి పలుమార్లు జోరువాన కురిసింది. ఉదయం జల్లులతో ప్రారంభమైన వాన 9 నుంచి 11గంటల వరకు ఏకధాటిగా కురిసింది. మళీ సాయంత్రం 4నుంచి 6గంటల వరకు కురి సింది. దీంతో పట్టణంలోని జయ రామారావు వీధి, పెద్ద మసీదువీధి, పూసలవీధి, వీరముష్టి పాళెం, భేరివారి మండపం నుంచి నగరివీధి, సినిమావీధి, కూరగాయాల మార్కెట్, బలరావ థియేటర్ సందు, ఓటేరు కాలువ, నారద పుష్కరణి, గాంధీవీధి, మంగళవీధి, ప్రభుత్వాస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో కాసేపు వర్షపునీరు ప్రవహించింది. శ్రీకాళహస్తిలో బుధవారం సాయంత్రం 6గంటల వరకు 43 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు జనార్దన రాజు తెలిపారు. ఇక విద్యాసంస్థల్లో తరగతులు యధావిధిగా సాగాయి. తొట్టంబేడు మండలంలో బుధవారం 83.6 మి.మీ వర్ష పాతం నమోదైనట్టు తహసీల్దారు భారతి తెలి పారు. ముళ్లపూడి ఎస్టీకాలనీ వద్ద లోలెవల్ కాజ్‌వే నీరు పొంగి ప్రవహించడంతో రాకపో కలు స్తంభించాయి. ఎక్కడా విద్యుత్ అంతరా యం ఏర్పడలేదని అధికారులు తెలిపారు. బుధవారం కురిసిన వర్షం ప్రభావంతో స్వర్ణముఖిలో నీటి ఉధృతి పెరిగింది.



ఆనందపురం ఎస్టీ కాలనీ వద్ద ఉధృతంగా రాళ్లవాగు

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం, నెరిణికండ్రిగ, కంచన పుత్తూరు, కారణి, నెలవాయి, వెస్ట్‌వరత్తూరు, వేణుగోపాలపురం, కల్లివెట్టు, తలారివెట్టుల్లో వర్షంతో వరి నీటి మునిగింది. ఉబ్బల మడుగు కలుజు పారుతుండడంతో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, సచివాలయ సిబ్బంది సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం పంచాయతీ కరిపేటి కాలువ, నెలటూరు చెరువులను ఇరిగేషన్ ఏఈ జ్యోతి, ఇన్‌చార్జి ఈఈ రత్నాకర్‌రెడ్డి పరిశీలించారు. బత్తలవల్లం పంచాయతీ చెక్‌పోస్టు నుంచి చిలమత్తూరు రహదారిని, కరిపేటి కాలువను పరిశీలించారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది వంతెనపై రాకపోకలు స్తంభించాయి. మోదుగులపాళెం, సిద్ధయ్యగుంట, కుమ్మరిగుంట, మడిబాక, సదాశివపురం, రాజులకండ్రిగల ప్రజలు పాపానాయుడుపేట మీదుగా గ్రామాలకు వెళుతున్నారు. అదే విధంగా గుడిమల్లం వద్ద సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎమ్మెల్యే సుధీర్ ఆదేశాలతో బుధవారం రాత్రి మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులను తహసీల్దారు కార్యాలయం నుంచి తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం పర్యవేక్షిస్తున్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం జడివాన కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలో 87.4 మి.మీ వర్షపాతం, ఉదయం నుంచి సాయంత్రం వరకు 36.7 మి.మీ వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. ఆనందపురం ఎస్టీకాలనీ వద్ద ఉన్న రాళ్ళవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలను అధికారులు ఆపివేశారు. మండలంలో వరి ప్రస్తుతం పిలక, ఎన్ను దశలో ఉంది. గురువారం కూడా వర్షం కొనసాగితే వందలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కాగా చెరువులు, కుంటలు పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగా ఉంది.





నెలటూరు చెరువును పరిశీలిస్తున్న అధికారులు - ఉధృతంగా ప్రవహిస్తున్న కరిపేటి కాలువ - మోదుగులపాళెం వద్ద ఏర్పాటు చేసిన కంచె

కొట్టుకుపోయిన పూడి మట్టి వంతెన



కేవీబీపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూడి గ్రామాలకు కాళంగి ఏరుపై ఏర్పాటు చేసిన మట్టి వంతెన కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తులు ఇళ్లకు చేరుకోవడానికి ఇబ్బంది పడ్డారు. రెండు నెలల్లో ఇప్పటికి నాలుగుసార్లు ఈ వంతెన కొట్టుకుపోవడం... మట్టితో తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టడం షరా మాములైంది. శాశ్వతంగా వంతెన నిర్మించాల్సి ఉంది.

కాళంగి జలాశయం ఏడు గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయంలో మూడు అడుగుల నీటిని దిగువకు వదిలారు. ఈనెల 2న మంగళవారం ఉదయం 218.6 అడుగులుగా నమోదైన నీటి మట్టం రాత్రి 220 అడుగులకు చేరింది. దీంతో బుధవారం ఉదయం ఏడు గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. ఇంకా పెరిగితే మరో రెండు గేట్లు ఎత్తుతామని ఆయన చెప్పారు. సిబ్బందిని జలాశయం వద్ద ఉంచి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిందిగా కోరామన్నారు.

సీఎం దృష్టికి సమస్యలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును బుధవారం శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. ముందుగా ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో పలు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

నాగలాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినోభానగర్‌లో పిచ్చాటూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యా హక్కు, నైపుణ్యం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. టీకే బేడు, నందనం, కాలంజేరి, కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సౌభాగ్యమ్మ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం: సుధీర్



యూరియా పంపిణీలో ఎమ్మెల్యే, తుడా చైర్మన్ తదితరులు

రేణిగుంట డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలని ఎమ్మెల్యే సుధీర్ కోరారు. బుధవారం రేణిగుంట మండల పరిధిలో టీడీపీకి ఓటింగ్ శాతం తక్కువ వచ్చిన జ్యోతినగర్, తూకివాకంలలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే విధంగా స్థానిక నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కూటమి నాయకులను కలుపుకుని పోవాలన్నారు. మండలాభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, వర్షాలు ఆగిన వెంటనే పనులు చేపడుతామన్నారు. రేణిగుంట మండలాన్ని తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేస్తే పదేళ్ల పన్ను రాయితీ ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ .. మండలంలోని చెరువులను తుడా నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే త్వరలో తూకివాకం చెరువును చేపల వేలం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం గాజుల మండ్యంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, మేరీ, బాబు, భాస్కర్ యాదవ్, నాదముని రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటముని రెడ్డి, నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కేవీబీపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక వంటి వారని తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మిద్దికండ్రిగ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీడీపీకి మంచి పట్టున్న నియోజకవర్గం సత్యవేడు అని అన్నారు. అయితే కొంతమంది రాగద్వేషాలతో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని వాపోయారు. దీంతో ఇప్పటి వరకు మండల, గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు చేయలేదన్నారు. త్వరలో వేరే మండలంనుంచి అబ్జర్వర్లు వస్తారని, వారి నివేదిక ఆధారంగా నియామకాలు జరుగుతాయన్నారు. అబ్జర్వర్లు సురేష్‌రాజు, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, జయరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి, దశరథయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశం ముగిసిన తరువాత అబ్జర్వర్లు బయలుదేరే సమయంలోనే కొంతమంది తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు సర్దుబాటు చేశారు.

టీడీపీని బలోపేతం చేయండి



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న సదాశివం

ఏర్పేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీని బలోపేతం చేసి ఓటింగ్ శాతం పెంచాలని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం సూచించారు. మండలంలోని దుర్గిపేరి, పల్లంపేట పంచాయతీల్లో బూత్‌స్థాయిలో టీడీపీ బలోపేతంపై విశ్లేషణ జరిగింది. బూత్ ఇన్‌చార్జులు వారి బూత్‌లలో ఓటింగ్ శాతం సరళిని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు ధనుంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, నైనారు పొన్నారావు, గాలి కృష్ణవేణి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌నాయుడు, మునెయ్య పాల్గొన్నారు.

ముగిసిన 'రైతన్నా మీ కోసం'

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం ముగిసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఒక బృందంగా ఏర్పడి ప్రతి రైతు ఇంటికెళ్లి సీఎం పంచసూత్రాలపై అవగాహన కల్పించామన్నారు. సాగుచేసిన పంటల గురించి అభిప్రాయాలు సేకరించామని, ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత గురించి వివరించామని చెప్పారు. 1,60,145 రైతుల కుటుంబాలను కలిశామని వెల్లడించారు.

తుఫాన్ సాయంపై నేతన్నల నిరసన

నారాయణవనం డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సాయంపై నారాయణవనంలో నేతన్నలు వర్షంలో తడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మగ్గం గుంతల్లో నీరు చేరిపోవడంతో రాష్ట్రప్రభుత్వం 25 కిలోల బియ్యం, పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను అందజేసిందని నేత కార్మికులు చెప్పారు. అయితే సాయం అందించడంతో అధికారులు పక్షపాతం చూపించారని నారాయణవనం, కైలాసకోన వీవర్స్ కాలనీ, తుంబూరు, పాలమంగళం ఉత్తర, దక్షిణపు కండ్రిగ నేతన్నలు వాపోయారు. అయితే దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో బుధవారం వర్షంలో నిరసన వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వీరాస్వామి ఇటీవల మృతి చెందాడు. బుధవారం ఆయన కర్మక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే సుధీర్ ... వీరాస్వామి ఇంటికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మునిరాజానాయుడు పాల్గొన్నారు.

6న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఈ నెల 6 వ తేదీన జాబ్ మేళా జరగనుంది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్, అపోలో ఫార్మసీ, జెప్టో, టాటా ఎలక్ట్రానిక్స్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ తదితర సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమో చదువుకున్న వారు అర్హులు. సుమారు 600 ఉద్యోగాల భర్తీకి ఈ మేళా చేపట్టనున్నారు. రూ.14 వేల నుంచి రూ.35 వేల దాకా వేతనం అందిస్తారు. 6వ తేదీన ఉదయం 10 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఈ మేళా ప్రారంభం కానుంది.

వామ్మో పాములు

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యలనాడు చెరువుకు దిగువున ఉన్న దక్షిణ కైలాస్‌నగర్ కాలనీలో బుధవారం రాత్రి పాములు స్థానికులను హడలెత్తించాయి. భారీ వర్షాలతో అయ్యలనాడు చెరువు నిండి దిగువన దక్షిణ కైలాస్‌నగర్ కాలనీలోకి నీరు ప్రవహించింది. దాంతో ఒకసారిగా పాములు నివాస గృహాల్లోకి చొరబడ్డాయి. దాంతో స్థానికుల్లో భయాందోళన వ్యక్తమైంది. అటవీశాఖ అధికారులు కాలనీకి చేరుకుని పాములను పట్టుకుని దూరప్రాంతంలో విడిచిపెట్టారు.

ఘనంగా గంగమ్మ జాతర

ఏర్పేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమందూరు బీసీ కాలనీలో బుధవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మహాకుంభాభిషేకం జరిగిన 42 రోజుల తరువాత అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.